ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

విశాఖపట్నం కేంద్రం

జాతీయ వార్తలు

తేదీ: 14-09-2026 సమయం : రాత్రి 8గం. 30ని.లు

ముఖ్యాంశాలు

- దేశాల సామాజిక, ఆర్థికాభివృద్ధికి, జాతీయ భద్రతకు, ప్రజల సంక్షేమానికి ఇంధన భద్రత బలమైన పునాది అని బ్రిక్స్ దేశాల అధినేతలు స్పష్టం చేశారు.

- ప్రధానమంత్రి నరేంద్రమోదీ న్యూఢిల్లీలోని యశోభూమి వేదికగా బుధవారం సెమికాన్ ఇండియా-2026 ఐదవ ఎడిషన్‌ను ప్రారంభించనున్నారు.

- అనేక భాషల ఉనికే దేశానికి అతిపెద్ద బలమని కేంద్ర హోంమంత్రి అమిత్ షా పేర్కొన్నారు.

- ఒడిశా, బిహార్, ఉత్తరాఖండ్, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తమిళనాడు, పుదుచ్చేరి, కేరళ రాష్ట్రాల్లో రేపటి వరకు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ విభాగం తెలిపింది.

= = = = = = = = = = = = = = = = = = =

దేశాల సామాజిక, ఆర్థికాభివృద్ధికి, జాతీయ భద్రతకు, ప్రజల సంక్షేమానికి ఇంధన భద్రత బలమైన పునాది అని బ్రిక్స్ దేశాల అధినేతలు స్పష్టం చేశారు. న్యూఢిల్లీ వేదికగా రెండు రోజుల పాటు జరిగిన బ్రిక్స్ శిఖరాగ్ర సమావేశంలో సభ్య దేశాలు ఈ కీలక అంశంపై విస్తృతంగా చర్చించాయి. ఈ సదస్సులో ఇంధన మార్కెట్ స్థిరత్వాన్ని కాపాడుకోవడం, విభిన్న వనరుల నుంచి ఇంధన సరఫరాలో ఎలాంటి అంతరాయం కలగకుండా చూడడం, కీలకమైన ఇంధన మౌలిక సదుపాయాలను రక్షించడం ద్వారా ఇంధన భద్రతను మరింత పటిష్టం చేయాల్సిన అవసరం ఉందని సభ్య దేశాలు ఉద్ఘాటించాయి. ఈ సదస్సులో ప్రధాని నరేంద్రమోదీ మాట్లాడుతూ.. సాంకేతికతను, కీలక ఖనిజాలను ఆయుధాలుగా మార్చడం భవిష్యత్తులో దేశాల పురోగతికి పెద్ద ముప్పుగా, ఆటంకంగా మారుతుందని హెచ్చరించారు. బ్రిక్స్ శిఖరాగ్ర సమావేశంలో 'న్యూఢిల్లీ డిక్లరేషన్'ను ఏకగ్రీవంగా ఆమోదించారు.

= = = = = = = = = = = = = = = = = = =

ప్రధానమంత్రి నరేంద్రమోదీ న్యూఢిల్లీలోని యశోభూమి వేదికగా బుధవారం సెమికాన్ ఇండియా-2026 ఐదవ ఎడిషన్‌ను ప్రారంభించనున్నారు. మూడు రోజుల పాటు జరిగే ఈ సదస్సుకు 600లకు పైగా ప్రదర్శనకారులు, 300 అంతర్జాతీయ కంపెనీలు, 40కి పైగా దేశాల నుంచి ప్రతినిధులు పాల్గొననున్నారు. ఈ ప్రదర్శనలో ప్రత్యేకంగా ఆరు దేశాల పెవిలియన్‌లతో పాటు, పన్నెండు రాష్ట్ర ప్రభుత్వాల పెవిలియన్‌లు, స్టార్టప్ పెవిలియన్ ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నాయి. భారత సెమీకండక్టర్ మిషన్, ఎలక్ట్రానిక్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రిత్వ శాఖ, 'సెమీ' (SEMI) సంయుక్తంగా నిర్వహిస్తున్న 'సెమికాన్ ఇండియా' దేశంలోనే అత్యంత ప్రధానమైన సెమీకండక్టర్ ప్రదర్శన. ప్రపంచవ్యాప్తంగా ఉన్న సెమీకండక్టర్, ఎలక్ట్రానిక్స్ రంగానికి చెందిన ప్రముఖ కంపెనీలను ఒకే వేదికపైకి తీసుకురావడానికి ఇది ఒక ఫ్లాగ్‌షిప్ వేదికగా పనిచేస్తుంది.

= = = = = = = = = = = = = = = = = = =

అనేక భాషల ఉనికే దేశానికి అతిపెద్ద బలమని కేంద్ర హోంమంత్రి అమిత్ షా పేర్కొన్నారు. హిందీ దినోత్సవం సందర్భంగా ఆయన ఈరోజు ఒక వీడియో సందేశాన్ని విడుదల చేశారు. ఏ ఇతర భాషతోనూ హిందీ పోటీ పడదని, జాతీయ ఐక్యతను చాటే ముఖ్యమైన అనుసంధాన వారధిగా నిలుస్తుందని అభివర్ణించారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ నాయకత్వంలో హిందీతో పాటు దేశంలోని అన్ని భాషలు సాంకేతిక అభివృద్ధి పరంగా సువర్ణయుగాన్ని చూస్తున్నాయని హోంమంత్రి తెలిపారు. నూతన జాతీయ విద్యా విధానం మాతృభాషకే అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని అమిత్ షా పేర్కొన్నారు. 'వికసిత్ భారత్' ప్రయాణంలో భాషను ఒక శక్తివంతమైన సాధనంగా మార్చాలని పౌరులను ఆయన కోరుతూ...

(వాయిస్...28 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = =

కేంద్ర విదేశాంగ మంత్రి డాక్టర్ ఎస్.జైశంకర్, వియత్నాం విదేశాంగ మంత్రి లే హోయ్ ట్రుంగ్‌తో కలిసి ఈరోజు 19వ భారత్ - వియత్నాం జాయింట్ కమిషన్ సమావేశానికి సహాధ్యక్షత వహించారు. న్యూఢిల్లీ వేదికగా జరిగిన ఈ భేటీకి సంబంధించిన వివరాలను జైశంకర్ సామాజిక మాధ్యమం వేదికగా పంచుకున్నారు. అత్యంత ఫలప్రదంగా సాగిన ఈ సమావేశంలో ఇరు దేశాల మధ్య రక్షణ, భద్రతా రంగాల్లో సహకారాన్ని మరింత పటిష్టం చేయడంపై చర్చించినట్లు ఆయన తెలిపారు.

= = = = = = = = = = = = = = = = = = =

ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ మూడు రోజుల పర్యటన నిమిత్తం ఈరోజు  భూటాన్ రాజధాని థింఫూ చేరుకున్నారు. ఈ పర్యటనలో భాగంగా ఆయన థింఫూలో భూటాన్ రాజు జిగ్మే ఖేసర్ నామ్‌గ్యెల్ వాంగ్‌చుక్ తో సమావేశం కానున్నారు. రేపు పరోలోని లా స్కూల్‌లో నిర్వహించనున్న భూటాన్ 'జాతీయ ఓటర్ల దినోత్సవ వేడుకల'లో ఆయన ప్రధాన అతిథిగా పాల్గొననున్నట్లు ఎన్నికల సంఘం వెల్లడించింది.

= = = = = = = = = = = = = = = = = = =

విరామం

= = = = = = = = = = = = = = = = = = =

జ్ఞానం, ఐశ్వర్యం, సౌభాగ్యాలకు ప్రతీక అయిన విఘ్నేశుడి జన్మదిన వేడుక 'వినాయక చవితి' పండుగను దేశవ్యాప్తంగా భక్తి శ్రద్ధలతో జరుపుకుంటున్నారు. వినాయక చవితిగా పిలిచే ఈ పర్వదినంతో పది రోజుల పాటు సాగే మహా వేడుకలు ప్రారంభమవుతాయి. ఈ ప్రత్యేకమైన రోజున భక్తులు ఇళ్లలో, మండపాలలో మట్టితో చేసిన వినాయక ప్రతిమలను ప్రతిష్టించి పూజలు చేశారు. పది రోజుల పాటు వైభవంగా జరిగే ఈ ఉత్సవాలు 'గణేష్ నిమజ్జనం' ఘట్టంతో ముగుస్తాయి.

= = = = = = = = = = = = = = = = = = =

అమెరికా అధ్యక్షతన నేడు జీ-20 ఇంధన మంత్రుల సమావేశంజరగనుంది. ఈ సదస్సులో పాల్గొనేందుకు కేంద్ర విద్యుత్, గృహనిర్మాణ, పట్టణ వ్యవహారాల శాఖా మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్ అమెరికా చేరుకున్నారు. మూడు రోజుల పాటు జరిగే ఈ సదస్సులో భాగంగా ఇంధన భద్రత, అనుమతులు - నియంత్రణలో పారదర్శకత, కీలక ఖనిజాలు, పటిష్టమైన సరఫరా గొలుసు వంటి అత్యంత కీలకమైన అంశాలపై ఆయన చర్చల్లో పాల్గొననున్నారు.

= = = = = = = = = = = = = = = = = = =

భారతీయ రిజర్వ్ బ్యాంక్ (RBI) సైబర్ మోసాలు, మ్యూల్ ఖాతాలపై కొత్త విధానాన్ని ప్రతిపాదించింది. ఇకపై అనుమానాస్పద లావాదేవీల్లో మొత్తం ఖాతాను ఫ్రీజ్ చేయకుండా, కేవలం వివాదాస్పద లావాదేవీ మొత్తాన్ని మాత్రమే తాత్కాలికంగా నిలిపివేయాలని ఆర్‌బిఐ సూచించింది. వెయ్యి రూపాయలు లేదా అంతకంటే ఎక్కువ మొత్తంతో కూడిన అసాధారణ బదిలీలను గుర్తించేందుకు బ్యాంకులు కృత్రిమ మేధ (ఏఐ) ఆధారిత లావాదేవీ పర్యవేక్షణ వ్యవస్థలను ఉపయోగించాలని స్పష్టం చేసింది. ఖాతాదారుడి ప్రొఫైల్‌కు సంబంధం లేకుండా అకస్మాత్తుగా జరిగే భారీ బదిలీలు లేదా సైబర్ మోసాల నెట్‌వర్క్‌లతో సంబంధం ఉన్న లావాదేవీలను ఈ ఏఐ సిస్టమ్ గుర్తిస్తుంది. ఈ ముసాయిదా మార్గదర్శకాలు వచ్చే ఏడాది ఏప్రిల్ 1 నుంచి అమల్లోకి రానున్నాయి.

= = = = = = = = = = = = = = = = = = =

నేపాల్ విద్యుత్ ప్రాధికార సంస్థకు విద్యుత్ ఎగుమతి చేసేందుకు కేంద్ర విద్యుత్ మంత్రిత్వ శాఖ అనుమతి ఇచ్చింది. ఈ ఏడాది సెప్టెంబర్ 13 నుంచి డిసెంబర్ 31 వరకు రోజులో 18 గంటల పాటు విద్యుత్ సరఫరా చేసేందుకు ఆమోదం తెలిపినట్లు మంత్రిత్వ శాఖ వెల్లడించింది. ఇటీవల వరదల కారణంగా నేపాల్‌లో జలవిద్యుత్ మౌలిక సదుపాయాలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. ఈనేపథ్యంలో నేపాల్ విద్యుత్ అవసరాలకు ఈ అనుమతి ఎంతగానో ఉపకరిస్తుందని, భారత్ - నేపాల్ మధ్య ఎప్పటి నుంచో ఉన్న బలమైన ఇంధన సహకారాన్ని ఇది మరింత బలోపేతం చేస్తుందని మంత్రిత్వ శాఖ పేర్కొంది.

= = = = = = = = = = = = = = = = = = =

దేశంలో రిటైల్ ద్రవ్యోల్బణం ఆగస్టులో వార్షిక ప్రాతిపదికన 4.82 శాతంకు పెరిగింది. భారతీయ రిజర్వ్ బ్యాంక్ (RBI) నిర్దేశించుకున్న 4 శాతం లక్ష్యంతో పోలిస్తే ఇది మూడో నెల కూడా ఎక్కువే ఉండటం గమనార్హం. ఆహార ధరలు అధికంగా ఉండటంతోనే జులై నెలలో నమోదైన 4.45 శాతంతో పోలిస్తే ఆగస్టులో ద్రవ్యోల్బణం మరింత పెరిగింది. గణాంకాలు, కార్యక్రమ అమలు మంత్రిత్వ శాఖ విడుదల చేసిన వివరాల ప్రకారం, గ్రామీణ ప్రాంతాల్లో ద్రవ్యోల్బణం 5.23 శాతం, పట్టణ ప్రాంతాల్లో 4.31 శాతంగా నమోదైంది.

= = = = = = = = = = = = = = = = = = =

పురుషుల క్రికెట్‌లో భాగంగా భారత్, ఆఫ్ఘానిస్థాన్ జట్ల మధ్య రేపు రెండో టీ-20 అంతర్జాతీయ మ్యాచ్ జరగనుంది. ఢిల్లీలోని అరుణ్ జైట్లీ స్టేడియం వేదికగా జరగనున్న ఈ మ్యాచ్ రాత్రి *7* గంటల 30 నిమిషాలకు ప్రారంభం కానుంది. మూడు మ్యాచ్‌ల ఈ సిరీస్‌లో తొలి మ్యాచ్‌లో అఖండ విజయం సాధించిన భారత్ ప్రస్తుతం 1-0 ఆధిక్యంలో కొనసాగుతోంది.

= = = = = = = = = = = = = = = = = = =

హరియాణా, చండీగఢ్, పంజాబ్, తూర్పు రాజస్థాన్, ఒడిశా, బిహార్ రాష్ట్రాల్లో రేపటి వరకు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ విభాగం (IMD) తెలిపింది. అలాగే ఈశాన్య రాష్ట్రాలైన అరుణాచల్ ప్రదేశ్, అస్సాం, మేఘాలయల్లో రాగల రెండు రోజుల పాటు ఇదేరీతిలో వాతావరణం ఉంటుందని తెలిపింది. ఇక ఉత్తరాఖండ్, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తమిళనాడు, పుదుచ్చేరి, కారైకల్, కేరళ, మాహే ప్రాంతాల్లో రేపటి వరకు ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ విభాగం స్పష్టం చేసింది.

= = = = = = = = = = = = = = = = = = =

ఒమన్ తీరానికి సమీపంలో వాణిజ్య నౌక 'ఎంటీ ఎల్ గైయాస (MT EL Gaia) పై జరిగిన దాడిని భారత్ తీవ్రంగా ఖండించింది. ఈ ఘటనపై ఒమన్‌లోని భారత రాయబార కార్యాలయం ఒక ప్రకటన విడుదల చేసింది. నౌకలో ఉన్న మొత్తం 13 మంది భారతీయ సిబ్బందిని రక్షించినట్లు ఎంబసీ వెల్లడించింది.

= = = = = = = = = = = = = = = = = = =
= = = = = = = = = = = = = = = = = = =